# 23న ఖేడ్‌కు మంత్రి దామోదర్ రాజనర్సింహ రాక




**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి ఆగస్టు 21:** ఈ నెల 23న నారాయణఖేడ్ పట్టణంలోని బాలాజీ అనురాధ ప్రైవేట్ ఆసుపత్రి ప్రారంభోత్సవానికి రాష్ట్ర వైద్య, ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖా మంత్రి దామోదర్ రాజనర్సింహ హాజరు కానున్నారని మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్ తెలిపారు.ఆదివారం ఉదయం 11 గంటలకు జరిగే ప్రారంభోత్సవ కార్యక్ర మానికి మంత్రి దామోదర్ రాజనర్సింహతో పాటు జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ షెట్కార్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ఆసుపత్రిని ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

వివరాలు 2లో






**కొండాపూర్ ప్రజా జ్యోతి**

గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం ప్రభుత్వం విడుదల చేస్తున్న నిధుల వినియోగంపై కొండాపూర్ మండలంలోని పలు గ్రామాల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గ్రామాల్లో వాస్తవంగా పనులు చేపట్టకుండానే పనులు పూర్తయినట్లు చూపిస్తూ నకిలీ బిల్లులు సమర్పించి పంచాయతీ ఖాతాల నుంచి లక్షలాది రూపాయలు డ్రా చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.వీధిలైట్ల ఏర్పాటు, బోరు మోటర్ల కొనుగోలుమరమ్మతులు, పారిశుద్ధ్య పనులు, ట్రాక్టర్ డీజిల్ తదితర ఖర్చుల పేరుతో నిధులు ఖర్చు చేసినట్లు రికార్డుల్లో చూపిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ఆయా పనులు జరిగిన దాఖలాలు లేవని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.మరికొన్ని చోట్ల పనులు పూర్తయినట్లు లిఎంబీలు (మెజర్‌మెంట్ బుక్స్)లిలో నమోదు చేసి, బిల్లులు సిద్ధం చేసి పంచాయతీ ఖాతాల నుంచి సంబంధిత వ్యక్తులకు నిధులు బదిలీ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత అధికారులు కలిసి నిబంధనలను పక్కనపెట్టి వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**క్షేత్రస్థాయి పరిశీలన ఎక్కడ?-**

ప్రభుత్వ నిధులతో చేపట్టినట్లు రికార్డుల్లో ఉన్న పనులను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించకుండా బిల్లులకు ఆమోదం తెలుపుతున్నారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఎంబీల్లో పనులు నమోదు చేసే ముందు వాస్తవంగా పనులు జరిగాయా? నాణ్యత ప్రమాణాలు పాటించారా? బిల్లులకు సంబంధించిన సామగ్రి కొనుగోలు జరిగిందా? అనే అంశాలపై సమగ్ర విచారణ జరపాల్సిన అవసరం ఉందని గ్రామస్థులు కోరుతున్నారు.

**ఆడిట్‌తో అసలు లెక్కలు బయటపడేనా?**

కొండాపూర్ మండలంలోని గ్రామ పంచాయతీల్లో గత కొంతకాలంగా జరిగిన అభివృద్ధి పనులు, వాటికి సంబంధించిన ఎంబీలు, వర్క్ ఆర్డర్లు, బిల్లులు, వౌచర్లు, బ్యాంకు లావాదేవీలను ఉన్నతాధికారులు సమగ్రంగా పరిశీలిస్తే అసలు విషయం వెలుగులోకి వస్తుందని ప్రజలు అంటున్నారు. ముఖ్యంగా పనులు జరగకుండానే నిధులు డ్రా చేసినట్లు తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.పంచాయతీ నిధులు ప్రజాధనం కావడంతో వాటి వినియోగంలో పారదర్శకత తప్పనిసరి. ఆరోపణలపై అధికారులు తక్షణమే ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, వాస్తవాలను ప్రజల ముందుంచాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# కాలువ పూడ్చివేతతో కథ ముగిసిందా?

## - పెద్ద చెరువు నీటిని తరలించిన వ్యవహారంపై ఇంకా వీడని అనుమానాలు
## - ఎఫ్‌టీఎల్, శిఖం హద్దులు తేలకుండానే చేపల చెరువులకు అనుమతులా?
## - రెండు జిల్లాలు.. మూడు మండలాల పరిధిలో ఉమ్మడి సర్వేకు గ్రామస్తుల డిమాండ్

**అందోల్, ఆగస్టు 21 (ప్రజాజ్యోతి):**

కన్సాన్‌పల్లి పెద్ద చెరువు నుంచి ప్రైవేటు చేపల చెరువులకు నీటిని తరలించేందుకు తవ్విన కాలువను ఇరిగేషన్ అధికారులు పూడ్చివేస్తుండటంతో వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది. ప్రజాజ్యోతి వరుస కథనాలకు స్పందించిన అధికారులు కాలువ పూడ్చివేతకు చర్యలు చేపట్టడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే కాలువను పూడ్చివేయడంతో మాత్రమే సమస్య పరిష్కారం కాదని, అసలు వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాలని వారు కోరుతున్నారు.



### తరలించిన నీటిని తిరిగి చెరువులోకి వదలాలి

పెద్ద చెరువు నుంచి ఇప్పటికే చేపల చెరువులకు తరలించిన నీటిని తిరిగి పెద్ద చెరువులోకి వదిలేలా అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. నీటిని తరలించిన కారణంగా చెరువు నీటి నిల్వకు జరిగిన నష్టాన్ని అంచనా వేసి, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా శాశ్వత చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

### ఎఫ్‌టీఎల్‌పై స్పష్టత ఎప్పుడు?

పెద్ద చెరువు ఎఫ్‌టీఎల్, శిఖం భూములు, సర్వే నంబర్లు, వాస్తవ హద్దులపై పూర్తిస్థాయి స్పష్టత రావాల్సి ఉందని గ్రామస్తులు అంటున్నారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో చేపల చెరువులు ఉన్నాయా? వాటి నిర్మాణాలకు ఎలాంటి అనుమతులు ఇచ్చారు? క్షేత్రస్థాయిలో పరిశీలన ఎలా జరిగింది? అనే ప్రశ్నలకు అధికారులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని పేర్కొంటున్నారు.



### రెండు జిల్లాలు.. మూడు మండలాలు

పెద్ద చెరువు పరిధికి సంగారెడ్డి, మెదక్ జిల్లాలకు చెందిన అందోల్, అల్లాదుర్గం, వట్పల్లి మండలాల సంబంధం ఉందని గ్రామస్తులు చెబుతున్నారు. అలాంటి చెరువు ఎఫ్‌టీఎల్, శిఖం హద్దుల నిర్ధారణలో అన్ని మండలాల రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల సమన్వయం అవసరమని అంటున్నారు. కేవలం ఒక మండలానికి చెందిన అధికారుల పరిశీలన ఆధారంగా చేపల చెరువులకు అనుమతులు ఇచ్చి ఉంటే దానిపై పూర్తిస్థాయి విచారణ జరపాలని కోరుతున్నారు.

### అనుమతులపై పునఃపరిశీలన అవసరం

చేపల చెరువుల నిర్మాణం, వాటి విస్తీర్ణం, నీటి వినియోగం, ఎఫ్‌టీఎల్ పరిధి తదితర అంశాలపై పూర్తి వివరాలను అధికారులు పరిశీలించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ఎఫ్‌టీఎల్‌పై స్పష్టత వచ్చే వరకు కొత్త అనుమతులు నిలిపివేయడంతో పాటు ఇప్పటికే ఇచ్చిన అనుమతులను కూడా పునఃపరిశీలించాలని ఇటీవల కలెక్టర్ ను కలిసిన సందర్భంగా గ్రామస్తులు కోరారు.



### ఉమ్మడి సర్వేతోనే వాస్తవాలు వెలుగులోకి

పెద్ద చెరువు విషయంలో నెలకొన్న అనుమానాలకు తెరపడాలంటే రెండు జిల్లాలు, మూడు మండలాల సంబంధిత రెవెన్యూ, ఇరిగేషన్, ఫిషరీస్ అధికారులు సమన్వయంతో ఉమ్మడి సర్వే నిర్వహించాల్సిందేనని గ్రామస్తులు అంటున్నారు. చెరువు అసలు హద్దులు, ఎఫ్‌టీఎల్, శిఖం భూములు, చేపల చెరువుల వాస్తవ విస్తీర్ణం, వాటికి సంబంధించిన అనుమతులపై సమగ్ర విచారణ జరిగితేనే అసలు వాస్తవాలు బయటపడతాయని పేర్కొంటున్నారు.

### కాలువ పూడ్చారు.. ఇక విచారణ ఎప్పుడు?

ప్రజాజ్యోతి వరుస కథనాల నేపథ్యంలో కాలువ పూడ్చివేతకు అధికారులు చర్యలు చేపట్టడం ఒక ముందడుగుగా గ్రామస్తులు భావిస్తున్నారు. అయితే కాలువ ఎవరి అనుమతితో తవ్వబడింది? నీటిని తరలించే వరకు సంబంధిత అధికారులు ఎందుకు గుర్తించలేదు? చేపల చెరువులకు ఇచ్చిన అనుమతుల ప్రక్రియ ఎలా సాగింది? ఎఫ్‌టీఎల్ పరిధిపై పరిశీలన జరిగిందా? వంటి ప్రశ్నలకు సమాధానాలు రావాల్సి ఉందని వారు అంటున్నారు. కాలువ పూడ్చివేతతో కథ ముగించకుండా.. మొత్తం వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

# 23న ఖేడ్‌కు మంత్రి దామోదర్ రాజనర్సింహ రాక

మొదటిపేజీ తరువాయి

ఆయన ఒక ప్రకటనలో పేర్కొంటూ.. నారాయణఖేడ్ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో బాలాజీ అనురాధ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనుభవజ్ఞులైన వైద్యులు డాక్టర్ కె. శ్రీధర్, ఎం.ఎస్, డాక్టర్ పట్లోళ్ల అనురాగ్ రెడ్డి, ఎం.డి, పీడియాట్రిషియన్ ఆధ్వర్యంలో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయని అన్నారు.ప్రాంత ప్రజలు ఆసుపత్రిలో అందుబాటులోకి రానున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఆసుపత్రి ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రజలు, ప్రజాప్రతినిధులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

# దెబ్బతిన్న ఇంటిని పరిశీలించిన తహసీల్దార్ అశోక్

## - బాధిత కుటుంబానికి నిత్యావసర వస్తువుల అందజేత..

## - 2వ విడుదల ఇందిరమ్మ ఇల్లు పథకం కింద ప్రతిపాదన...

**కొండాపూర్ ప్రజా జ్యోతి**

మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామంలో శుక్రవారం తెల్లవారుజామున ఎర్రోళ్ల సుజాతకు చెందిన పెంకుటి ఇల్లు అకస్మాత్తుగా దెబ్బతింది. విషయం తెలుసుకున్న తహసీల్దార్ అశోక్ వెంటనే స్పందించి బాధిత





కుటుంబాన్ని పరామర్శించారు.తహసీల్దార్ అశోక్ గ్రామ సర్పంచ్ జి. శ్రీనివాస్ గౌడ్, జీపీఓ సుమలతతో కలిసి దెబ్బతిన్న ఇంటిని పరిశీలించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులకు నిత్యావసర వస్తువులను అందజేసి, కుటుంబానికి అండగా నిలిచారు.ఇల్లు దెబ్బతినడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబానికి శాశ్వత పరిష్కారం కల్పించేలా 'ఇందిరమ్మ గృహనిర్మాణ పథకం 2వ దశ' కింద నూతన గృహం మంజూరుకు ప్రతిపాదించడం జరిగింది.అనుకోని ఘటనతో ఇబ్బందుల్లో ఉన్న కుటుంబానికి తక్షణమే స్పందించి నిత్యావసర వస్తువులు అందించడంతో పాటు, నూతన ఇంటి కోసం ప్రతిపాదన చేయడంపై గ్రామస్థులు తహసీల్దార్ అశోక్‌ను అభినందించారు.

# 1855 ఏళ్ల బీసీ మహిళలకు ఉచిత కుట్టు మిషన్ల పంపిణీ

## - సెప్టెంబర్ 15లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి

**సంగారెడ్డి ప్రజా జ్యోతి ఆగస్టు 21:-**

- జిల్లాలోని బీసీ మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రోత్సాహం అందించేందుకు ఇంటింటికి ఇందిరమ్మ కుట్టు మిషన్ల పంపిణీ పథకం కింద ఉచిత కుట్టు మిషన్ల పంపిణీకి అర్హులైన మహిళలు సెప్టెంబర్ 15లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి జగదీష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.అర్హులైన మహిళలు http://tgobmms.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.దరఖాస్తుదారుల వయస్సు 18 నిండి 55 సంవత్సరాల లోపు ఉండాలని, నిరుద్యోగ మహిళలు, నిరుపేదలు, నిరాధారణకు గురైన వితంతు, ఒంటరి, వికలాంగులు, అనాధ మహిళలకు, టైలరింగ్ ట్రైనింగ్ సర్టిఫికెట్ ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు.నివాసం, కులం, ఆదాయం, ఆధార్, విద్యార్హత, టైలరింగ్ శిక్షణకు సంబంధించిన ధ్రువపత్రాలు, తెల్ల రేషన్ కార్డ్ లేదా ఆహార భద్రత కార్డు కలిగి ఉండాలని, కనీస అక్షరాస్యత తప్పనిసరి అని, ఎక్కువ దరఖాస్తులు వస్తే కనీస విద్యార్హత ఐదవ తరగతి పాసైన వారికి ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. కుటుంబంలో ఒకరికి మాత్రమే అవకాశం ఉంటుందని, కుటుంబ వార్షిక ఆదాయం గ్రామీణులకు 1.50 లక్షలు, పట్టణ వాసులకు రెండు లక్షల లోపు ఉన్నవారు అర్హులని తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో బీసీ స్వయం ఉపాధి పథకం కింద ఆర్థిక లబ్ధి పొందిన వారు అర్హులు కాదని స్పష్టం చేశారు. దరఖాస్తుదారులు దరఖాస్తులను సంబంధిత వెబ్సైట్ నుండి డౌన్లోడ్ చేసుకుని కుల, ఆదాయ, నివాస, ఆధార్ కార్డు, రేషన్ కార్డ్, విద్యార్హతలు, టైలరింగ్ శిక్షణ, అనుభవం తదితర ధ్రువీకరణ పత్రాలతో గ్రామీణులు సంబంధిత మండల పరిషత్ అభివృద్ధి అధికారికి, పట్టణ ప్రాంతవాసులు సంబంధిత మున్సిపల్ కమిషనర్లకు సెప్టెంబర్ 15లోగా దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

# అధ్యక్ష పదవి ఇస్తే మండలం ఆగమవుతుంది..

## - కొండాపూర్ సర్పంచుల్లో సంచలన వ్యాఖ్యలు..

## - సర్పంచుల ఫోరం అధ్యక్ష పదవిపై అసంతృప్తి..

## - మద్దతు కోసం హామీలిస్తున్నారంటూ ఆరోపణలు..

**కొండాపూర్ ప్రజా జ్యోతి**

కొండాపూర్ మండల సర్పంచుల ఫోరం అధ్యక్ష పదవి వ్యవహారం కొండాపూర్ మండలంలో ఆసక్తికరంగా మారింది. అధ్యక్ష పదవికి ఓ వ్యక్తి పేరు తెరపైకి రావడంతో పలువురు గ్రామాల సర్పంచులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం.తమకు మద్దతు ఇవ్వాలని సర్పంచులను బతిమిలాడడంతో పాటు, ఆర్థికంగా అండగా ఉంటానని దొంగ హామీలు ఇస్తూ మభ్యపెడుతున్నారని కొందరు సర్పంచులు ఆరోపిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ ఆరోపణలను సంబంధిత వ్యక్తి ఖండించే అవకాశం ఉంది.సర్పంచుల ఫోరం అధ్యక్ష పదవి మండలంలోని అన్ని గ్రామాల సర్పంచుల సమస్యలను సమన్వయం చేసే కీలక బాధ్యత అని, అందువల్ల అందరి ఆమోదంతో సమర్థుడైన వ్యక్తిని ఎంపిక చేయాలని పలువురు సర్పంచులు అభిప్రాయపడుతున్నట్లు సమాచారం.సదరు వ్యక్తికి సర్పంచుల ఫోరం అధ్యక్ష పదవి ఇస్తే కొండాపూర్ మండలం ఆగమయ్యే పరిస్థితి ఏర్పడుతుంది.అంటూ కొందరు సర్పంచులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు తెలిసింది.అయితే అధ్యక్ష పదవికి సంబంధించిన వ్యవహారంపై ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి నిర్ణయం వెలువడలేదు. సర్పంచుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని ఏకాభిప్రాయంతో ఫోరం అధ్యక్షుడిని ఎంపిక చేస్తారా, లేక పోటీ కొనసాగుతుందా అనేది వేచి చూడాల్సి ఉంది.

# క్రికెట్ టోర్నమెంట్ ను ప్రారంభించిన ప్రముఖ న్యూరో డాక్టర్ కృష్ణ మూర్తి,

**సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి :**

తెలంగాణ స్టూడెంట్స్ వాయిస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బాక్స్ క్రికెట్ టోర్నమెంట్ ను ప్రముఖ న్యూరో డాక్టర్ కృష్ణ మూర్తి ప్రారంభించారు . శుక్రవారం సంగారెడ్డి పట్టణంలోనీ ఎం. యస్. క్రికెట్ అకాడమీలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376 వ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన టోర్నమెంట్ మొదటి మ్యాచ్ తేజ కాలేజీ ఎ లా కాలేజీ టాస్ వేసి డాక్టర్ కృష్ణ మూర్తి ప్రారంభించారు ఈ సందర్భంగా డాక్టర్ కృష్ణ మూర్తి మాట్లాడుతూ యువత సర్ధార్ సర్వాయి పాపన్న గౌడ్ చరిత్రను స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు చదువు, క్రిడా రంగంలో అద్భుత విజయలు సాధించి జిల్లా అన్నారు..యువజన సంఘాల సమితి రాష్ట్ర అధ్యక్షుడు కూన వేణు మాట్లాడుతూ విద్యార్థులు మొబైల్ ఫోన్ లకు ఎక్కువ సమయం గడపకుండా మైదానంలో సమయం కేటాయించాలి అన్నారు.. ఈ కార్యక్రమంలో తెలంగాణ స్టూడెంట్స్ వాయిస్ అధ్యక్షుడు బంగారు కృష్ణ, కార్యదర్శి చింతల సాయి కుమార్, ఎల్ వేణు గోపాల్ , ప్రభాకర్ గౌడ్, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు...










# పాండురంగ మాహేలా కాలనీలో అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ కు శంకుస్థాపన

## - ప్రజలకు వైద్య సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యం

## - మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్

**జహీరాబాద్, ఆగస్టు 21 (ప్రజా జ్యోతి న్యూస్)**

జహీరాబాద్ మున్సిపల్ పరిధిలోని పాండు రంగ మహేల కాలనీలో ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో నిర్మాణ వ్యయం రూ.143.00 లక్షల తో ఏర్పాటు చేయనున్న అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ నిర్మాణ పను లకు మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. సందర్భంగా చైర్మన్ మహమ్మద్ యూనుస్ మాట్లాడుతూ, జహీరాబాద్ పట్టణంలో అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లనుమంజూరు చేసినందుకు ముందుగా హెల్త్ మినిస్టర్ దామోదర రాజనర్సింహకి మరియు ఎంపీ సురేష్ శెట్కార్ కి కృతజ్ఞతలు తెలుపుతూ పట్టణ ప్రజలకు ప్రాథమిక వైద్యం అందించేందుకు ఆరోగ్య కేంద్రాలు ఎంతో కీలకమని అన్నారు. పాండురంగ మహేల కాలనీతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు చిన్నచిన్న ఆరోగ్య సమస్యల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే వైద్యసేవలు పొందేలా యూ పి హెచ్ సి ఉపయోగపడుతుందని అన్నారు.ప్రాథమిక వైద్యం అందుబాటులో ఉండటంతో పాటు ఆరోగ్య పరీక్షలు, సాధారణ అనారోగ్యా లకు వైద్య సలహాలు, అవసరమైన మందుల పంపిణీ, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు, ప్రజారోగ్య పరిరక్షణకు సంబంధించిన సేవలు మరింత చేరువయ్యే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా పేదలు,వృద్ధులు, మహిళలు, చిన్నారులకు ఈ ఆరోగ్య కేంద్రం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని తెలిపారు.ప్రజలకు అవసరమైన రోడ్లు, డ్రైనేజీ, పారి శుద్ధ్యం, తాగునీరు వంటి మౌలిక సదుపాయా లతో పాటు ఆరోగ్య సేవల అభివృద్ధికి కూడా మున్సిపాలిటీ ప్రాధాన్యత ఇస్తుందని చైర్మన్ తెలిపారు. పట్టణ అభివృద్ధి అనేది కేవలం మౌలిక వసతుల కల్పనతో పూర్తి కాదని ప్రజల ఆరోగ్యం పరిశుభ్రమైన వాతావరణం మెరుగైన జీవన ప్రమాణాలు కూడా అభివృద్ధి లో భాగమేనని పేర్కొన్నారు. అధికారులు మాట్లాడుతూ యు పి హెచ్ సి నిర్మాణం పూర్తయిన అనంతరం స్థానిక ప్రజలకు ప్రభుత్వ వైద్య సేవలు మరింత సులభంగా అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ప్రజలు ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని, ఆరోగ్యంపై అవగాహన పెంచుకొని ముందస్తు వైద్య పరీక్షలకు ప్రాధాన్యతఇవ్వాలని సూచించారు. ఈ శంకుస్థాపన కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జి. ప్రభాకర్, డిప్యూటీ డిఎంహెచ్వో, వైస్ చైర్మన్ శిరీష సురేందర్ రెడ్డి, డీఈ మహేష్, ఏఈ వెంకటేష్ కౌన్సిలర్లు జహంగీర్, సోనియమ్మ యిర్మియ, మున్సిపల్ అధికారు లు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, స్థానికనాయ కులు, కాలనీప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు తమ ప్రాంతంలో అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ఏర్పాటు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, వైద్య సేవలు స్థానికంగా అందుబాటులోకి రావడం వల్ల ఎంతో ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులకు ప్రాధాన్యతిస్తున్న మున్సిపల్ చైర్మన్ కు వారు కృతజ్ఞతలు తెలిపారు.

# పాలిటెక్నీక్ విద్యార్థుల పోరాటానికి సంపూర్ణ మద్దతు

## - జి.ఓ 97పై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి

## - ఎస్సి కార్పొరేషన్ మాజీ చెర్మెన్ వై.నరోత్తం



**జహీరాబాద్, ఆగస్టు 21 (ప్రజా జ్యోతి న్యూస్)**

రాష్ట్రంలో పాలిటెక్నిక్ విద్యావ్యవస్థ నిర్వీర్యా నికి దారితీసే జి.ఓ 97 ను వెంటనే రద్దు చేయాలి, నాణ్యమైన ఇంజనీరింగ్ స్థాయి విద్యను డిప్లొమా దశలోనే అభ్యసిస్తున్న ఇలాంటి విద్యావ్యవస్థను కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ విద్యాచట్టం పరిధి నుండి తొలగించడం విద్యార్థులకు తీరని నష్టం, విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడటం సరైంది కాదు. కార్పొరేట్ శక్తుల కుట్రలో భాగమే పాలిటెక్నిక్ కళాశాలలను శక్తిలో విలీన నిర్ణయం, జీవో97 ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కారణంగా విద్యార్థులు ఆందోళన చెంది వారి విద్య భవిష్యత్తును కాపాడుకోవ టానికి ఆందోళనలు చేస్తున్నారు. యువత భవిష్యత్తే తమ లక్ష్యమని చెప్పే ప్రభుత్వం, అదే యువత తమ భవిష్యత్ కోసం రోడ్లపైకి వచ్చే పరిస్థితి ఎందుకు వచ్చింది, అన్ని అలాగే ఉంటాయి అని ప్రభుత్వం చెపుతున్న విద్యార్థులు ధర్నాలు ఎందుకు చేస్తున్నారు. ప్రభుత్వం విద్యార్థులు, ఉపాధ్యాయులతో చర్చించి వారి సందేహాలను నివృత్తి చేసి లిఖిత పూర్వకంగా హామినివ్వాలని అన్నారు. విద్యార్థులు చేస్తున్న ఉద్యమానికి బిఆర్ఎస్ పార్టీ తరపున సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నాం, సాంకేతిక విద్యాశాఖ పరిధిలోనే పాలిటెక్నిక్ విద్యా యధా విధిగా కొనసాగించాలని డిమాండ్.

# డ్రాఫ్ట్ ఓటర్ల లిస్ట్ జాబితాలో పేర్లు లేని వారికి నోటీసులు అందజేత

**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి ఆగస్టు 21:**

నారాయణఖేడ్ మున్సిపాలిటీలో ఎస్ఐఆర్ డ్రాఫ్ట్ ఓటర్ లిస్ట్ జాబితాలో పేర్లు లేని వారికి నోటీసులు అందజేస్తున్నట్లు మున్సిపల్ వార్డు ఆఫీసర్ పండరి తెలిపారు. శుక్రవారం మున్సిపల్ కమిషనర్ వి. ప్రశాంతి ఆదేశాల మేరకు డ్రాఫ్ట్ ఓటర్ లిస్ట్ జాబితాలో పేర్లు లేని వారికి నోటీసులు అందజేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా వార్డు ఆఫీసర్ పండరి మాట్లాడుతూ.. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా సంబంధిత వ్యక్తులు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను సమర్పించాల్సి ఉంటుందన్నారు. 1987 జూలై 1 కంటే ముందు జన్మించిన వారు ఒక డాక్యుమెంట్ సెల్ఫ్, 1987 జూలై 1 నుంచి 2004 జూలై 1 మధ్య జన్మించిన వారు రెండు డాక్యుమెంట్లు సెల్ఫ్‌తో పాటు తండ్రి లేదా తల్లిదండ్రుల్లో ఒకరి డాక్యుమెంట్, 2004 జూలై 1 తర్వాత జన్మించిన వారు మూడు డాక్యుమెంట్లు సెల్ఫ్, తండ్రి, తల్లి సమర్పించాల్సి ఉంటుందని వివరించారు. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం లేదా ప్రభుత్వ రంగ సంస్థలో పనిచేసే రెగ్యులర్ ఉద్యోగికి జారీ చేసిన గుర్తింపు కార్డు లేదా పెన్షన్ చెల్లింపు ఉత్తర్వులు, 1 జులై 1987కు ముందు ప్రభుత్వం, స్థానిక అధికార యంత్రాంగం, బ్యాంకులు, పోస్టాఫీసులు, భారతీయ జీవిత బీమా సంస్థ లేదా ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా భారతదేశంలో జారీ చేసిన గుర్తింపు కార్డు, ధ్రువీకరణ పత్రం లేదా ఇతర డాక్యుమెంట్, సమర్థ అధికారిచే జారీ చేసిన జనన ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్ట్, గుర్తింపు పొందిన బోర్డులు లేదా విశ్వవిద్యాలయాలు జారీ చేసిన మెట్రిక్యులేషన్ లేదా విద్యార్హత ధ్రువీకరణ పత్రం, సంబంధిత రాష్ట్ర సమర్థ అధికారిచే జారీ చేసిన శాశ్వత నివాస ధ్రువీకరణ పత్రం,అటవీ హక్కుల ధ్రువీకరణ పత్రం, సమర్థ అధికారిచే జారీ చేసిన ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ లేదా ఇతర కుల ధ్రువీకరణ పత్రం,ప్రభుత్వం జారీ చేసిన భూమి లేదా ఇంటి కేటాయింపు ధ్రువీకరణ పత్రం, ప్రభుత్వం సూచించిన పై ధ్రువీకరణ పత్రాల్లో ఏదైనా సమర్పించవచ్చని తెలిపారు.అలాగే, 1 జులై 2025 నాటి ప్రత్యేక సమగ్ర సవరణ ఓటర్ల జాబితా నిబంధనల ప్రకారం సంబంధిత ధ్రువీకరణ పత్రాలను సమర్పించాలని సూచించారు. డ్రాఫ్ట్ ఓటర్ లిస్ట్ జాబితాలో పేర్లు లేని వారు నోటీసులను స్వీకరించి, నిర్ణీత సమయంలో అవసరమైన పత్రాలను సమర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.



# జోగు సంగీత హత్య కేసులో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

## - బాధితులకు న్యాయం జరిగే వరకు అండగా ఉంటా:

## నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ చైర్మన్ నవోదయ సిద్ధార్థ

**కల్హేర్, ఆగస్టు 21 (ప్రజాజ్యోతి):**

కంగ్టి మండలం దెగుల్‌వాడి గ్రామానికి చెందిన జోగు సంగీత హత్యకు కారణమైన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి, నిందితులను అరెస్టు చేసి జైలుకు పంపించాలని కోరుతూ ఇండియన్ నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ చైర్మన్ నవోదయ సిద్ధార్థ ఆధ్వర్యంలో సంగీత అక్క కవిత శుక్రవారం ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను కలిసి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా మానవ హక్కుల సంస్థ చైర్మన్ నవోదయ సిద్ధార్థ, డా. బాబు రావు తదితరులు జోగు సంగీతకు జరిగిన అన్యాయం, హత్యకు సంబంధించిన పూర్తి వివరాలను కమిషన్ చైర్మన్‌కు వివరించారు. దీనిపై స్పందించిన బక్కి వెంకటయ్య వెంటనే సంగారెడ్డి జిల్లా ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడి, జోగు సంగీత హత్య కేసులో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు.కమిషన్ చైర్మన్ సూచనలపై జిల్లా ఎస్పీ కూడా సానుకూలంగా స్పందించి, నిబంధనల ప్రకారం తప్పకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సంస్థ చైర్మన్ నవోదయ సిద్ధార్థ తెలిపారు.ఈ సందర్భంగా నవోదయ సిద్ధార్థ మాట్లాడుతూ, జోగు సంగీత కుటుంబానికి న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఇండియన్ నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ కార్యాలయానికి వచ్చి వినతిపత్రం అందజేశారని తెలిపారు. వారి విజ్ఞప్తిపై స్పందించి ఈ నెల 2న దెగుల్‌వాడి గ్రామానికి వెళ్లి సంగీత కుటుంబాన్ని పరామర్శించినట్లు చెప్పారు.కేసు విచారణలో జాప్యం జరుగుతోందని కంగ్టి పోలీస్ స్టేషన్ ఎస్సైని కలిసి కేసు పురోగతిపై చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు.



## కల్హేర్: ముత్యాల పోచమ్మ ఆలయ నిర్మాణానికి భూమిపూజ. సర్పంచ్ జైపాల్ రాపర్తి

**కల్హేర్:21.ఆగస్టు. ప్రజా జ్యోతి.**

కల్హే ర్ మండలంలోని రాపర్తి గ్రామంలో నూతన ముత్యాల పోచమ్మ ఆలయ నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామ సర్పంచ్ జైపాల్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమానికి గ్రామస్థులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నూతన ఆలయ నిర్మాణం త్వరగా పూర్తై, గ్రామానికి ఆధ్యాత్మిక కేంద్రంగా నిలవాలని గ్రామస్థులు ఆకాంక్షించారు. కార్యక్రమం సందర్భంగా గ్రామంలో భక్తి వాతావరణం నెలకొంది.



## సంగారెడ్డి లో జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా న్యాయ అవగాహన సదస్సు



**సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి:**



సంగారెడ్డి జిల్లా మహిళా ప్రాంగణంలో జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, సీనియర్ సిటిజన్స్ శాఖల ఆధ్వర్యంలో న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. సౌజన్య వయోవృద్ధుల హక్కులు, చట్టపరమైన రక్షణలపై కీలక సూచనలు చేశారు. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు ఇప్పుడు చూద్దాం.వయోవృద్ధుల అనుభవం, జ్ఞానం సమాజానికి ఎంతో విలువైనవని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. సౌజన్య అన్నారు. జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని సంగారెడ్డి మహిళా ప్రాంగణంలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... పెద్దలను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, వారికి భద్రతతో కూడిన గౌరవప్రదమైన జీవితాన్ని అందించేందుకు కుటుంబ సభ్యులు, సమాజం మరియు ప్రభుత్వ శాఖలు కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ మరియు సంక్షేమ చట్టం ద్వారా అందుబాటులో ఉన్న హక్కులు, పరిరక్షణ మార్గాలను ఈ సందర్భంగా వివరించారు.వయోవృద్ధులపై నిర్లక్ష్యం, వేధింపులు, ఆస్తుల విషయంలో మోసాలు జరిగినప్పుడు భయపడకుండా అధికారులను సంప్రదించాలని సౌజన్య సూచించారు. బాధితులకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచితంగా న్యాయ సలహాలు, సహాయం అందిస్తామని స్పష్టం చేశారు. అలాగే ప్రభుత్వం అందిస్తున్న పింఛన్లు, ఆరోగ్య పరిరక్షణ, సామాజిక భద్రతా పథకాలను వయోవృద్ధులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.వృద్ధాప్యంలో తల్లిదండ్రులకు మానసిక, ఆర్థిక సహకారం అందించాల్సిన బాధ్యత పిల్లలపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ సిటిజన్స్ శాఖ అధికారులు, న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో వయోవృద్ధులు పాల్గొన్నారు.

## డీసీసీ అధ్యక్షుడి నియామకంపై కాంగ్రెస్ శ్రేణుల అభిప్రాయ సేకరణ

## కల్హేర్‌లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో పరిశీలకుల సమావేశం

**కల్హేర్, ఆగస్టు 21 (ప్రజాజ్యోతి):**




సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడి నియామక ప్రక్రియలో భాగంగా కల్హేర్ మండల కాంగ్రెస్ కార్యకర్తలు, సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధుల నుంచి కాంగ్రెస్ పార్టీ పరిశీలకులు అభిప్రాయాలను సేకరించారు.నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశానికి



ఏఐసీసీ పరిశీలకులు దీపక్ రాథోడ్, టీపీసీసీ పరిశీలకులు దుద్దిళ్ల శ్రీనుబాబు, రియాజ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, మండల అధ్యక్షులు, అనుబంధ సంఘాల బాధ్యులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలతో పరిశీలకులు సమావేశమై డీసీసీ అధ్యక్ష పదవికి సంబంధించి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు.సమావేశంలో కల్హేర్ నూతన సర్పంచ్ కోడి గంగారం, ఉపసర్పంచ్ మహేష్తో పాటు సీనియర్, యువ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. కల్హేర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, గైని దేవాదాస్, బి. పోచయ్య, వై. రవీందర్ రెడ్డి, సంగారెడ్డి, మల్లొడ్డి తుకారం, ఎం. వీర్‌శెట్టి, కేశగొండ, కే. నారాయణ తదితరులు సమావేశానికి హాజరై తమ అభిప్రాయాలను పరిశీలకులకు తెలియజేశారు.

# శక్తి స్కీమ్‌పై విద్యార్థినుల గళం

## - పాలిటెక్నిక్‌ను స్కీమ్‌లో చేర్చడంపై అభ్యంతరం..
## - మూడు రోజులుగా కొనసాగుతున్న నిరసనలు
## - ర్యాలీకి యత్నం.. అడ్డుకున్న పోలీసులు
## - నిర్ణయం వెనక్కి తీసుకోకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరిక



**ఆందోల్, ఆగస్టు 21 (ప్రజాజ్యోతి):**

పాలిటెక్నిక్ విద్యను శక్తి స్కీమ్‌లో చేర్చుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై విద్యార్థినుల ఆందోళన కొనసాగుతోంది. సంగారెడ్డి జిల్లా ఆందోల్ మండలంలోని మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో వరుసగా మూడో రోజు విద్యార్థినులు నిరసన చేపట్టారు. తమ భవిష్యత్తుపై ప్రభావం చూపే నిర్ణయాన్ని ప్రభుత్వం పునఃపరిశీలించాలని డిమాండ్ చేశారు.కళాశాల ఎదుట రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపేందుకు విద్యార్థినులు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. పోలీస్ యాక్ట్ అమల్లో ఉన్నందున ధర్నాకు ముందస్తు అనుమతి అవసరమని పోలీసులు సూచించారు. దీంతో ర్యాలీ నిర్వహించి తమ నిరసనను వ్యక్తం చేస్తామంటూ విద్యార్థినులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు.




### కాలేజీ ఆవరణలోకి తరలింపు

సమాచారం అందుకున్న పోలీసులు కళాశాల ప్రిన్సిపాల్‌ను పిలిపించి విద్యార్థినులను తిరిగి కళాశాల ఆవరణలోకి తీసుకెళ్లారు. ఈ క్రమంలో అటుగా వెళ్తున్న బీజేవైఎం నాయకుడు ప్రవీణ్‌రెడ్డి విద్యార్థినులకు మద్దతుగా నిలిచి పోలీసులతో మాట్లాడేందుకు ప్రయత్నించారు. ఇది కళాశాలకు సంబంధించిన అంశమని, విద్యార్థులను రెచ్చగొట్టవద్దని సీఐ అనిల్‌కుమార్ సూచించారు.

### భవిష్యత్తుపై ఆందోళన

పాలిటెక్నిక్ విద్యను శక్తి స్కీమ్‌లో చేర్చడం వల్ల తమ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందని విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతో ఆశతో పాలిటెక్నిక్ విద్యలో చేరామని, ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో తమకు అన్యాయం జరుగుతోందని అన్నారు. కళాశాలలను ప్రైవేటుపరం చేసే ప్రయత్నాలను ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

### నిర్ణయం వెనక్కి తీసుకోవాలి

తమ సమస్యను ప్రభుత్వం సానుకూలంగా పరిష్కరించి విద్యార్థులకు భరోసా కల్పించాలని కోరారు. సమస్య పరిష్కారం కాకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అవసరమైతే సమ్మెకు సిద్ధంగా ఉండాలని తోటి విద్యార్థినులకు పిలుపునిచ్చారు.